ఆంధ్రవాహిని (అట్లాంటా) నిర్వహించిన 1988 శ్రీరామనవమి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

ప్రతిబింబం

పార్వతీదేవి

నిశీధి తిరుగులేని నియంతలా ప్రపంచాన్ని ఆక్రమిం చింది. చుట్టూ వున్న చీకటి పేదరికంలా నల్లగా భయం కరంగా వుంది.

సన్నగా వాన తుంపరలు పడుతున్నాయి.

బస్ షెల్టర్‌లో నిల్చున్నాను. నాతో పాటు నిల్చున్న అతని వంక చూశాను. సరిగ్గా అదే సమయంలో అతను కూడా నా వైపు చూశాడు.

నవ్వాను అతని కళ్ళలో కి చూస్తూ. బదులు నవ్వలేదతను. తడబడుతూ తల త్రిప్పుకున్నాడు. విసుగు కలిగింది. మరీ అమాయకుడిలా వున్నాడు.

తల తిప్పి మరో ప్రక్కకు చూశాను. పది, పన్నెండేళ్ళ కుర్రాడు నిల్చుని వున్నాడక్కడ. చిరుగులు పడ్డ చొక్కాతో మట్టి కొట్టుకున్న శరీరంతో బురదలో పడ్డ మందార పువ్వులా వున్నాడు.

రాత్రి పదిన్నర అవుతుంది కాబట్టి ఆ బస్ స్టాపు నిర్మానుష్యంగా వుంది. కేవలం మేము ముగ్గురమే వున్నాము. వచ్చిన పది నిమిషాలలో అర డజను సార్లయినా నవ్వి వుంటాను అతని వంక చూసి. కాని అతనిలో చలనం లేదు.

చలనం తెప్పించాలి. ఇతను కాకపోతే ఈ రోజుకు గిరాకీలు వుండవు. గిరాకీ వుండని రోజు సంపాదన వుండదు.

"చాందీ నగర్ బస్ వెళ్ళి పోయిందాండి?" దగ్గరగా వెళ్ళి అడిగాను.

"ఇంకా రాలేదండి!" అతని గొంతులో ఒణుకు స్పష్టంగా వినిపిస్తోంది.

"ఈ బస్సు వస్తుందో రాదో" మెల్లిగా అన్నాను.

అతను సమాధానం చెప్పలేదు. మౌనంగా వుండిపోయాడు.

మరో ఆడదైతే అలా పరాయి మగవాడితో మాట్లాడదు. నేనూ ఆడదాన్నే. కాని మామూలు ఆడదాన్ని కాను. సమాజం నీపుపై లేచిన రాచపుండును.

"మీ దగ్గర ఓ యాభై రూపాయలున్నాయా" చిన్నగా అడిగాను.

తల వూపాడు. ఫర్వాలేదు. దారిలోకొచ్చాడు పురుషుడు.

"నా కూడా వస్తారా? మీతో రమ్మంటారా?" అడిగాను.

"నా రూమ్‌కు వస్తారా?" అడిగాడతను.

"ఆటో చార్జీలు ఇస్తే?"

"ఆటోలు ఎక్కడున్నాయి?"

"పోనీ రిక్షా పిలవండి" అతనికి దగ్గరగా జరుగుతూ చెప్పాను. అతని నరాల్లో కదలిక ప్రారంభమై వుండాలి. ఈ చలిరాత్రి తన పక్కలో నా వెచ్చటి ఒంటిని వూహించుకుని...

ఒక్క క్షణం కాస్త తటపటాయించాడు. మరు క్షణం నన్ను దగ్గరగా లాక్కున్నాడు. నా పెదవులకు అతని పెదవులు బలంగా అతుక్కుపోయాయి.

కాస్సేపటికి రిక్షాలు ఆగివున్న చోటికి నడిచాడతను. నేను ఆ కుర్రాడి వైపు చూశాను. వాడు అలాగే నిలబడి

చూస్తున్నాడు. కళ్ళు విప్పార్చుకుని దేశంలో జరిగే అన్యాయాలను చూస్తున్న న్యాయదేవతలా అలాగే చూస్తున్నాడు.

ఈలోగా రిక్షా తీసుకు వచ్చాడతను. టాపు వేసిన ఇరుకు రిక్షాలో ఇద్దరం సర్దుకు కూర్చున్నాం.

ఆ పరిస్థితిలో ప్రతి విటుడు చేసే పనినే అతడూ చేశాడు. నా భుజం చుట్టూ వేసిన అతని చేతిని క్రిందకు జార్చడం. ప్రశ్న కూడా ప్రతి విటుడూ వేసే మొదటి ప్రశ్నే వేశాడు.

"మీ పేరు?"

"రేఖ" సమాధానం చెప్తూనే వెనక్కు చూశాను. ఆ కుర్రాడు అలాగే నిలబడి వున్నాడు. వానలో తడుస్తూ రాతి విగ్రహంలా అలాగే నిలబడి వున్నాడు.

* * * * * *

రోడ్డుపై మెల్లిగా నడుస్తున్నాను. చేతిలో సరుకులు వున్న సంచి బరువుగా వుంది. ఇంట్లో అమ్మ నా కొరకు ఎదురు చూస్తూ వుంటుంది. అమ్మ గుడ్డిది. అవును అమ్మకు కళ్ళు లేవు. కళ్ళు వుండి కూడా తన కూతురు బ్రతికే బ్రతుకు చూస్తే గుండె ఆగి చనిపోయేది.

నాన్న గారు బ్రతికి వున్న రోజుల్లో మేము ఎంతో ఆనందంగా, ఎంతో వైభవంగా బ్రతికే వాళ్ళం. హఠాత్తుగా నాన్నగారు పోవడంతో ఆ రోజులు కూడా పోయాయి.

ఇల్లు గడవడం కష్టమై అమ్మా, నేనూ ఎంతో బాధ పడ్డాము. తిండి లేక, బట్టలు లేక చాలా దరిద్రం అనుభవించాము.

సరిగ్గా అప్పుడే నాకు తెలిసింది. ఆడది సరియైన చదువు లేకపోయినా, ఉద్యోగం లేకపోయినా బతక వచ్చునని.

చుట్టూ వుండే మగవాళ్ళ ఆకలి చూపులు నా ఆకలి తీర్చడానికి వుపయోగించుకున్నాను.

అంతే! నేను నా అందాన్ని వుపయోగించి బతకడం నేర్చుకున్నాక, దరిద్రం నన్ను వదలి పారి పోయింది. పగలంతా నేను మామూలు ఆడదాన్నే. పగలు నన్ను చూసిన వారు ఏ కాలేజీలోనో చదువుకునే అమ్మాయిననుకుంటారు.

కాని... రాత్రి. రాత్రి అయితే నా స్వభావమే మారిపోతుంది.

కొంచెం దూరంలో ఏదో కలకలం వినిపించడంతో ఉలిక్కిపడి ఆలోచనల నుండి తేరుకున్నాను. రోడ్డుపై ఒక పక్కగా పెద్ద గుంపు. అటు చూశాను.

"వేలెడు లేడు వెధవ. దొంగతనాలు. లోకం మరీ పాడైపోతుందండీ" ఎవరో పుణ్యాత్ముడు బాధపడి పోతున్నాడు.

ఆ కుర్రాడే. నిన్న రాత్రి నేను బస్ స్టాండులో చూసిన కుర్రవాడు. అందరి మధ్య దోషిలా నిలుచు న్నాడు. పసితనం పూర్తిగా పోని వాడి ముఖంలో క్లియ ర్‌గా కనబడుతోంది ఆందోళన. ఒంటిపై అక్కడక్కడ గాయాలయ్యాయి. అయినా వాడు ఏడవడం లేదు. ఈ పరిస్థితిలో ఎలా తప్పుకోవాలా అనే ఆలోచిస్తు న్నట్లున్నాడు.

వాడిని చూడగానే గుంపు మధ్యకు వెళ్ళాను.

"ఏం శ్రీను! ఇక్కడ వున్నావేం?" అన్నాను.

వాడు తెల్లబోయాడు. వాడితోబాటు చుట్టూ వున్న జనం కూడా ఒక గొప్పింటి ఆడది దొంగ తనాలు చేసే ఒక కుర్రాడిని అంత వనువుగా పలక రించడం అక్కడి వారికి కొరుకుడు పడలేదు.

"మీకు తెలుసా?" గుంపులో నుంచి ఎవరో అడిగారు.

"మా బంధువులబ్బాయి"

వాడి చెయ్యి పట్టుకుని అక్కడి నుంచి ముందుకు నడిచాను. ఎవ్వరూ మాట్లాడలేదు. మాట్లాడరు. నాకు తెలుసు. వీరాధి వీరులమంటూ మీసాలు తిప్పే ఈ మగధీరులు ఆడది ఎదురు-తిరిగితే సమాధానం చెప్పలేరు. నేను అనుభవంతో తెలుసుకున్న నిజమిది.

"ఆ పర్సు నేనే తీశానండి. ఆ తర్వాత క్రింద పారవేశాను" కొంత దూరం వెళ్ళాక చెప్పాడా కుర్రాడు.

"తెలుసు" నడుస్తూనే చెప్పాను.

"మరి?"

మనస్సులోని భావాన్ని మాటల్లో పెట్టడం చేతకాని ఆ కుర్రాడు తడబడ్డాడు.

"ఈ దొంగతనాలు మానేసి నా దగ్గర వుంటావా?" అడిగాను.

"ఉంటాను" చెప్పాడు వాడు.

ఒక్క క్షణం ఆగి తిరిగి చెప్పాడు "మరి నాకు రోజూ అన్నం పెడతావా?"

ఆశగా, ఆర్తంగా, ఆబగా వాడు అడిగిన ప్రశ్నకు నా కళ్ళలో చివ్వున నీళ్ళు చిమ్మాయి.

"పెడతాను. మంచి బట్టలు కూడా కుట్టిస్తాను. చదువు కూడా చెప్పిస్తాను. సరేనా?"

ఆగిపోయి నా మొఖంలో కి ఆశ్చర్యంగా చూశాడు. ఆ తర్వాత నా చేతిలోని సరుకుల సంచి తీసుకున్నాడు. వద్దన్నా వినలేదు.

"అక్కా! ఇందాక అక్కడ అందరితో నేను మీ బంధువుల అబ్బాయినని అన్నావే. మనిద్దరి మధ్యా వున్న బంధుత్వమేమిటి?"

"పేదరికం" చెప్పాను.

నా కనురెప్పల వెనుక కన్నీరు ముల్లులా గుచ్చుకుంది.

●

మనిషికి హితవు

మనము హితవరులు నిజ మిత్రులందరు
తరుణమో ధారుణమో దయాధ్యాతరులో
అన్యులపై మనము జన్మమ్మందు అర్థాంగి
నామము నీ యింట అడుగిడిన అన
నీవు నీ వారలు నిలువుమ్ము చెప్పరుచు
నీవు స్వాగతం త్వమును పరియుంచ జేయుచె

ఈ ధరపై తరువులను ధన జానురెండలో
సమరములు నీడ్చు సమయి కాలంబ్రమున
ఎదుగ నేరదు వారు యింటనును మేడి
కాంతులా శ్రీపరియు సర్వాధికారియు
ఉద్యోగ వ్యాపార, పుత్రమైత్రినట్టి
పదవులెల్లను పొందలేదా నీ కొరకె
నీవు కష్టింపవది నీ అంత్యకాలమున
మెంపుగ నుండునెటా మనుజవా యిప్పుడే

అష్టైశ్వర్యము చేకూరును నమ్మ వెడల మరి
నష్టతను కలిగెను పరి పాప ఫలమును
చిత్తశుద్ధిగ జేసి పురందర విలయి
చిత్తవైశాత్తమైన కృపనందు మనుజవా

(పురందరదాసు కీర్తన)

సర్వపల్లి నుండి తెనుగు సేత: పి. సరస్వతి